# దూరం

పోయినవారం విద్యార్థులతో రాయించిన కాంపోజిషన్ 'వ్యక్తి స్వాతంత్ర్యము' లోని తప్పులు దిద్దుతూ కాలేజి స్టాఫ్‌రూంలో కూర్చున్నాను.

కాంపోజిషన్లలో చావని పదార్థమంటూ వుండదు. రోగిష్టి భాష! చిలకపలుకుల భావాలు!! కొన్నాళ్ళకు వాళ్ళ భాషా పరిజ్ఞానం సంగతేమో కానీ తప్పుల్ని దిద్ది దిద్ది, ఒప్పుల్ని తప్పులనుకొని, తప్పుల్ని ఒప్పులనుకొని నా భాష చస్తుంది. ఈ విషయాలు క్లాసులో నేను చెప్పలేదే, చెప్పానేమో అని సందేహజీవినై కొరకాకుండా పోతాను.

ఉదయం మొదటి గంట నన్నయ అరణ్యపర్వంలోని పద్యభాగం చెప్పాను. మూడవ గంట తెలుగు వెలుగు నాటకం చెప్పాను. నన్నయ్యను చూసినా, తెలుగు వెలుగు విన్నా వీళ్ళ తెలుగు మాత్రం యింతే...

దిద్దుతున్నాను... ఆఖరుకు వీడిదీ అదే చిలక పలుకు! 'వ్యక్తి స్వాతంత్ర్యమనగా ఒక ప్రభుత్వము ఒక సమాజమునందలి వ్యక్తులకు అన్ని విధములు గల వ్యక్తి స్వేచ్ఛకు వ్యక్తి స్వాతంత్ర్యము అని పేరు' రెండు కర్తలు. నా కర్మ!! యీ క్రియ తప్పదు. దిద్దుతున్నాను. పార్ట్‌టైం టెంపరరీ కాలేజీ లెక్చరరు అనగా... వ్యక్తి స్వేచ్ఛలో పొల్లులేదు. గీశాను కసిగా... అయిపోయింది.

యిక ఈ చివరి గంట కాంపోజిషన్ 'ప్రణాళికలు – దేశాభ్యుదయము' మనసులో ప్రణాళికలు – దేశాభ్యుదయము కళ్ళకు కట్టుతోంది!

"సాబ్ టెలిగ్రాం!"

టెలిగ్రాం అందుకున్నాను, గుండె చిక్కబట్టుకొని.

"రామచంద్ర సీరియస్ స్టార్ట్ యిమిడియట్లీ టు కాళహస్తి" స్నేహితుడు శివారెడ్డి ఇచ్చిన టెలిగ్రాం అది! మనసు వికలమయింది.

హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ వ్యాధితో వేలూరు ఆస్పత్రిలో మూన్నెళ్ళనుంచీ బాధపడుతున్న ప్రియమిత్రుడు రామచంద్ర మృత్యుముఖంలో ఉంటాడు లేదా చివరి గడియలు కూడా పూర్తి

అయి ఉంటాయి. తప్పదు. టెలిగ్రాం అర్థం అదే. నాలాంటి వాడికి వచ్చే టెలిగ్రాముల్లో అశుభం కాక శుభం ఉండదని నా నమ్మకం.

ఆ రకం ఆలోచనలు భరించలేకపోయాను.

నెలరోజుల క్రిందటే యశోధర నుంచీ ఉత్తరం వచ్చింది – 'రామచంద్రను వేలూరులో చేర్పించాం. నిన్ను కలవరిస్తున్నాడు రమ్మ'ని. రామచంద్రను చూచి పలకరించి వచ్చాను.

అప్పుడు వాడంత కష్టంలో వుండి కూడా నేను కన్పిస్తూనే నన్నడిగిన మొదటి ప్రశ్న "యెక్కడయినా స్థిరపడ్డావా? డబ్బు యిబ్బందుల్లేకుండా కుదుట పడ్డావా?" అని.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేక సిగ్గుతో చచ్చిపోయాను.

రామచంద్రే పాలిపోయిన చిరునవ్వుతో అన్నాడు.

"మన ఇబ్బందులన్నీ చావుతో తీరేవే. నా సంగతే చూడు. సంవత్సరం నుంచీ యీ వ్యాధి బతకనివ్వదు, చావనివ్వదు. మెడికల్ లీవు అయిపోయింది. జీతం లేదు. యశోధరా సెలవుల్లో వుంది, సగం జీతమే. మీలాంటి స్నేహితుల్లేకపోతే, యీపాటికి..."

ఆ తరువాత మాట పూర్తి చేయలేకపోయాడు. నా పక్కనే వున్న శివారెడ్డి:

"దానికేముందిలేరా, నీ ఆరోగ్యం ముఖ్యం కానీ" అన్నాడు.

'మీలాంటి స్నేహితులు' అన్నందుకు తల యెక్కడ పెట్టుకోవాలో నాకు అర్థం కాలేదు. శివారెడ్డి తప్ప రామచంద్రకు నేను చేసిన సాయమేముంది? చేయగలిగిన వుపకార మేముంది?

చదువుకునే రోజుల్లో నేను ఇవ్వలేని, ఇవ్వని యెన్నో చిల్లర బాకీలు రామచంద్ర దగ్గర చేశాను. అంతెందుకు, యేడాదికింద హైదరాబాద్ నుంచి ఉత్తరం రాస్తే రెండు వందలు పంపాడు. అది గుర్తుకొచ్చింది. వాడిని చూడటానికి యెన్ని అవస్థలు పడి వేలూరు వచ్చానో అది గుర్తుకొచ్చింది. డబ్బులేదు. అయినా సమకూర్చుకున్నా. సెలవు లేదు – ప్రతిరోజు నాకు పనిదినమే కాబట్టి. అయినా పదిరోజులు పోగొట్టుకున్నా కష్టాల్లో వున్న స్నేహితుడికి సహాయం చెయ్యలేని నా నిస్సహాయత్వం, నాకు భరించరాకుండా వుంది.

"నేను మళ్ళీ వారం పదిరోజుల్లో వస్తాలేరా! నువ్వేం యిది అవ్వద్దు. యేదైనా అవసరం వస్తే యశోధరను జాబు రాయమని చెప్పు. డాక్టర్లతో అన్ని విషయాలు మాట్లాడాను. మదరాసు నుంచీ నెల్లూరుకి వెళ్తాలే! నేను వస్తారా, అన్నట్లు యీవాళ రాత్రికి యశోధర వస్తుంది" అన్నాడు శివారెడ్డి.

శివారెడ్డి పట్ల రామచంద్ర కళ్ళలో మెదులుతున్న కృతజ్ఞతా భావం చూసి చలించిపోయాను.

పోతూ పోతూ... నాతో శివారెడ్డి అన్నాడు.

"వీలుంటే నువ్వు వుండరా! కాలేజీలో పనిదేముంది? అందులో హైదరాబాద్‌లో. డబ్బు కోసం మొగమాట పడవద్దులే."

వాడి ధోరణి నాకు నచ్చలేదు. వాడిని నేను యేనాడూ మెచ్చలేదు. నా తత్త్వం వాడికి యేనాడూ నచ్చలేదు. అయినా రామచంద్ర వల్ల మా స్నేహం చెడిపోలేదు. కానీ ఆ వాతావరణంలో

ఏమీ అనలేక "హైదరాబాద్‌లో ఆవిడకు తోడు యెవరూ లేరురా. యశోధర వస్తూనే నేను రేపు వెళ్తా" అన్నాను. నిజానికి కాలేజీలో నాది పర్మినెంట్ పోస్ట్ అని శివారెడ్డి అనుకున్నట్లుంది. వాడి దగ్గర నా గొడవలు యెప్పుడూ చెప్పలేదు. అప్పుడూ చెప్పలేదు.

వాడు వెళ్ళిపోయాడు.

దిక్కుతోచక వోదార్పుగా అన్నాను – "యీ వ్యాధి తప్పకుండా బాగవుతుందిరా" అని.

"డాక్టర్లు చివరిదాకా అట్లానే అంటారులేరా. నిజం అడిగి చూడు!" అన్నాడు.

నేను చీఫ్‌ను కలుసుకొని నిజమడిగి చూశాను. మరో మూడు నాలుగు మాసాలు ఫరవాలేదు. ఆపరేషన్ విజయవంతమైతే యే యిబ్బందీ లేదని నమ్మకంగా చెప్పాడు. ఆయన ప్రఖ్యాతిని గురించి విని వుండటం చేత నమ్మాను. రామచంద్రతో ఆపరేషన్ తప్పకుండా సక్సెస్ అవుతుందని చెప్పాను.

వాడు విని నెమ్మదిగా అన్నాడు: "యీ రకం బ్రతుక్కంటే చావటం మేలు. కానీ అందర్నీ కాదని నన్ను నమ్మి పెళ్ళి చేసుకున్న యశోధరే యేమవుతుందో" అన్నాడు.

వాడి పిచ్చి ఆలోచనల్లో నిజముందని అన్పించినా, "మేమున్నాం కదరా" అన్నాను.

ఈ రోజు టెలిగ్రాం! ఆపరేషన్ ప్రయోజనం లేకపోయి ఉంటుంది. రామచంద్రను కాళహస్తికి తీసుకు వెళ్ళివుంటారు!

నాకు మనసు పనిచేయటం లేదు. గంట మోగింది. సాయంకాలం చివరి గంట. క్లాసు తీసుకోక తప్పదు. క్లాసుకు వెళ్ళాను. 'ప్రణాళికలు – దేశాభ్యుదయం' ఆవాళ విద్యార్థులు రాయవలసిన కాంపోజిషన్! పది పదిహేను నిమిషాలు యేంచెప్పానో నాకే తెలియలేదు. మాటిమాటికీ టెలిగ్రాం మనసులో మెదలుతోంది. మాటలు తడబడుతున్నాయి. ఒక వాక్యానికీ మరొక వాక్యానికీ సంబంధం లేకుండా పోతోంది. సాధ్యంకాక మనసు బాగులేదని చెప్పి, వాళ్ళను రాయమని కూచున్నాను. గంట యెలాగో గడిచింది. వృత్తిధర్మం నెరవేరింది.

ఆరు రూపాయల సంపాదన ఆ గంటకు వచ్చింది. ఆవేళ మొత్తం సంపాదించింది పద్దెనిమిది. మొత్తం మూడు క్లాసులు అయ్యాయి. 'రోజూ మూడు క్లాసులుంటే' అన్పించింది. టెలిగ్రాం మనసులో మెదులుతూనే వుంది.

దాదాపు యాభై అరవై కాంపోజిషన్ పుస్తకాల్లోని ప్రణాళికలు, దేశాభ్యుదయాలనీ మోసుకొని స్టాఫ్‌రూం చేరాను. స్టాఫ్‌రూం ఖాళీగా వుంది. అందరూ వెళ్ళిపోయారు.

యిల్లు చేరుకోటానికి బస్‌స్టాప్ దగ్గరకు వచ్చాను. విద్యానగర్ వెళ్ళేబస్సు యింకా రాలేదు. జేబులో రెండు రూపాయలుంది. యింట్లో యే యిరవై అయిదు, ముప్ఫయో ఉంటాయి. టెలిగ్రాం నన్ను వదలలేదు.

కాళహస్తికివెళ్ళాలి; వెళ్ళక తప్పదు; వెళ్ళి తీరుతాను అనుకున్నా.

బస్‌స్టాప్‌లో అటు పక్క యిద్దరు స్నేహితులు పగలబడి నవ్వుకుంటూ మాట్లాడు కుంటున్నారు. చదువుకునే రోజుల్లో మా స్నేహం గుర్తుకొచ్చింది.

రామచంద్ర, నేనూ, శివారెడ్డి యూనివర్సిటీ హాస్టలులో ఒకే గదిలో వుండేవాళ్ళం. రామచంద్ర, శివారెడ్డి ఫైనల్లో వుండేవాళ్లు. నేను ప్రీవియస్‌లో వుండేవాణ్ణి. ఆ రోజుల్లో ఎన్నికలలో యెంత వుత్సాహమో!! ముఖ్యంగా నాకూ, రామచంద్రకూ. మా కలలను వింటూ శివారెడ్డి ఎగతాళి చేస్తూ అనేవాడు. "కాస్త భూమ్మీదకు దిగి బతకండ్రా. లోకంలో ఈ కలల్తో మీరు దమ్మిడీ విలువ చెయ్యర్రా" అని. వాడన్నట్లే జరిగింది.

రామచంద్ర యశోధరను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆమె రామచంద్ర క్లాస్‌మేట్, నాకు దూరపు బంధువు. ఈ పెళ్ళితో యశోధరవాళ్ళ నాన్న కూతురు ముఖం చూడలేదు. నిజానికి ఆయన పరిస్థితికి కూతురి పెళ్ళి చేయటం ఘనమే. సులభంగా చదువుకున్న అల్లుడు దొరికితే కులం పట్టింపులని ఆయన వంక పెట్టటం చూసి నాకు మండింది. మా బంధువు అవటం వల్ల ఆయన బ్రాహ్మణ్యం, పవిత్రతా నాకు తెలియనివి కావు. అయినా పెళ్ళి ఆగలేదు. పెళ్ళి ఖర్చులు భరించింది ముఖ్యంగా శివారెడ్డి. గట్టిగా నిలబడి పెళ్ళి జరిపించిన వాళ్ళం నలుగురైదుగురం. గొడవలేమీ జరుగలేదు. గవర్నమెంట్ కాలేజీలో యిద్దరికీ జూనియర్ లెక్చరరు పోస్టులు దొరికాయి. రెండేళ్ళు తిరిగిందో లేదో రామచంద్రకు హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ జబ్బు. యిప్పుడైనా యశోధరా వాళ్ళ నాన్న వచ్చి వుంటాడో లేదో?

శివారెడ్డి జిల్లా ఆఫీసరయ్యేడు. ఒక లక్ష కట్నం తెచ్చుకున్నాడు. నెల్లూరులో హాయిగా వుంటున్నాడు. స్నేహం కోసం డబ్బు ఖర్చు పెట్టగలిగిన వాడి స్థితి పెరిగిందే కానీ తరగలేదు. శివారెడ్డి స్నేహదృష్టీ మారలేదు. వాడిలో నాకు నచ్చినది ఒకటే – స్నేహితుల కోసం తాను పెట్టే ఖర్చును తానే చాటుకుంటాడు.

నేనేమో వొళ్ళు పొగరుతో నాలుగయిదు ఉద్యోగాలు పోగొట్టుకున్నాను. హైదరాబాదు వీధుల్లో తిరిగి యీ ఉద్యోగం చిక్కించుకున్నాను. ఆలోపు పెళ్ళి అయింది. నాకంటే అధ్వాన్నమైన పరిస్థితుల్లో వున్న మేనమామ కూతురు వరలక్ష్మితో పెళ్ళి అయ్యింది. కుదురుగా భయభక్తులతో వుండక తప్పలేదు. యేడాది నుంచీ యీ ప్రైవేట్ కాలేజీలో గంటకు ఆరు రూపాయల లెఖ్ఖన మూడువందలు నాలుగు వందల సంపాదన వస్తోంది. స్ట్రైకులు, సెలవలు వుండకూడదని తీరిక సమయాల్లో ధ్యానం చేస్తుంటాను. పర్మనెంట్ వుద్యోగం కోసం యెదురు చూస్తూ జీవిస్తున్నాను. మేనేజ్‌మెంట్ ఆశలు చూపుతూనే వుంది.

యిటువంటి నాకు నెల మధ్యలో కాళహస్తికి వెళ్ళటానికి కనీసం వందన్నా కావాలి. హైదరాబాదుకూ కాళహస్తికీ మధ్యవుండే దూరం నా కళ్ళల్లో మెదులుతోంది.

అది నడవలేని దూరం.

రైల్లోనో, బస్సులో మాత్రమే వెళ్ళే దూరం!

ప్రయాణానికి డబ్బులు అవసరమయిన దూరం!

అతి దగ్గరైన గుండెల మధ్య కాలంలో, స్థలంలో దూరం!

'యెంతెంత దూరం – చాల చాల దూరం' అనే చిన్న పిల్లల ఆట జ్ఞాపకానికి వస్తోంది. నా గొర్రె తోక జీవితం చిన్న పిల్లల ఆటను నిజం చేస్తోంది.

చేతిలో ఒక్క వందా యాభై, కనీసం ఒక్క వంద వున్నా ఈ కాలాన్ని, స్థలాన్ని జయించగలను. తాత్కాలికంగానైనా సరే వాటిని దాటగలను. కాళహస్తికి రేపు ఉదయం చేరుకోగలను. కానీ డబ్బు? యీ మహానగరంలో యిచ్చే నాథుడు నాకు కన్పించటం లేదు. రెండు మూడుగంటల వ్యవధిలో వంద దొరికే ఉపాయం తోచటం లేదు.

నామీద, నా వుద్యోగం మీద నాకు మంట పుట్టింది. వట్టి మంటవల్ల సమస్యలు తీరవని నాకు తెలుసు. అయినా మండింది.

బస్సు వచ్చింది. గుంపులో జొరబడి కాళ్ళ తొక్కిళ్ళకు లోనై, కసిగా నేనూ తొక్కి బస్సులో యింత చోటు సంపాదించుకున్నాను. కండక్టరు ముందుకు వెళ్ళమని హెచ్చరించాడు. ముందుకు నెట్టుకుపోతూ మంచి దుస్తుల్లో వున్న ఎవరో యువకుని కాలు ఈర్ష్యతో తొక్కాను. అదృష్టవశాత్తూ ఆ యువకుడు నన్నేమీ అనలేదు.

పరుగెడుతోన్న బస్సులోంచి నగరం కన్పిస్తోంది. నగరమంతా నాకు డబ్బుగానే కన్పిస్తుంది, కాని అది నా చేతిలో లేదు.

యిల్లు చేరుకున్నాను.

"యేం అట్టా వున్నారు?" అని అడిగింది వరలక్ష్మి.

టెలిగ్రాం అందించాను.

"యెవరికేమైంది చెప్పండి?" ఆతురతగా ఆందోళనగా.

రామచంద్ర విషయం చెప్పాను.

సానుభూతితో అంది వరలక్ష్మి.

"పాపం, మీరు వెళ్ళి చూసి వస్తేనే బావుంటుంది."

"డబ్బులు లేవు" అన్నాను నీరసంగా.

"నిజమే వెళ్ళి యెవరు మాత్రం చేసేదేముంది?"

వరలక్ష్మి సత్వర సమాధానానికి గతుక్కుమన్నాను. యెంత సులభంగా మాట మార్చింది అనుకున్నా. కాని ఆమె పొడిమాటలు వెనుక లోకజ్ఞతా, నిస్సహాయతనుంచీ పుట్టిన వేదాంతమూ ఉన్నాయని నాకు తెలుసు. అయినా వరలక్ష్మి మీద కోపం వచ్చి అణుచుకున్నాను.

'మా నాన్నకో, మీ నాన్నకో యెట్లాన్నో వుంటే వెళ్ళి మాత్రం చేసేదేముంది అంటావా?' అని అడుగుదామనుకున్నాను. అడిగి ప్రయోజనం లేదు. అలాంటి సమయాల్లో వరలక్ష్మి నా అప్రయోజకత్వాన్ని దెప్పి పొడవచ్చు. యేడ్చి మొత్తుకోవచ్చు. నా నిస్సహాయతను శపించవచ్చు అనుకున్నాను. స్నేహితుడు రక్తబంధువు కాదు. లేమిని పెంచుకోవటం విజ్ఞత కాదు. అందుకేనేమో వరలక్ష్మి వేదాంతం.

దిక్కు తోచని స్థితిలో ఆలోచిస్తుంటే ఆశ తళుక్కుమంది. పీటర్ మనసులో మెదిలాడు. అతన్ని డబ్బు అడిగితే అనుకున్నాను. అడగక తప్పదు. నేను ద్వేషించే పీటర్‌నే డబ్బు అడగక తప్పదు.

ఆంధ్ర లయోలాలో బి.ఎ.,లో నా క్లాస్‌మేట్. యిప్పుడు కాలేజీలో పర్మనెంట్ లెక్చరరు. వాడి భార్యా లెక్చరరే. రెండు చేతులా సంపాదిస్తున్నారు. డబ్బు వుండకపోదు. మొదటినుంచీ వాడు జాగ్రత్త మనిషి. పెద్ద ఉద్యోగి కొడుకు.

వున్నట్టుండి బయలుదేరాను. నా వాలకం చూసి వరలక్ష్మి "యెక్కడికండి" అని అడిగింది. "యిప్పుడే వస్తా"నంటూ పీటర్ యింటికి బయలుదేరాను. పీటర్ వాళ్ళ యిల్లు మా యింటికి కాస్త దగ్గరే.

దారంబడి ఆలోచనలు, ఆందోళన, సంకోచం – పీటర్ యేమంటాడోనని.

పీటర్ యింట్లోనే వున్నాడు. పీటర్ భార్య సుగుణ యింట్లో లేనట్లుంది.

పరిస్థితి వివరించాను. రెండు వందలు ఆదుకోమని ప్రాధేయపడ్డాను. ఒకవైపు నేను ప్రాధేయపడుతున్న భాషే నాకు యెబ్బెట్టుగా వుంది. హీనంగా వుంది. ఆత్మహింసగా వుంది. అకారణంగా నేను ద్వేషించే పీటర్ ముఖం నాకు మరింత ముచ్చుగా కన్పిస్తోంది. కానీ ప్రాధేయపడ్డాను.

పీటర్ నా వైపు విచిత్రంగా చూశాడు.

"స్నేహితుని కోసమా?" అన్నాడు.

అవునన్నాను.

యేమనుకున్నాడో యేమో మర్యాదగా చెప్పాడు.

"సారీ శ్రీరాం! క్రిస్మస్ ఖర్చులు వచ్చి పడ్డాయి. ఐ పిటీ, అయినా చూస్తా వుండు."

పీటర్ అవతలి గదిలోకి వెళ్ళాడు. అడిగి లేదనిపించుకుంటానేమో, లేదని చెపితే ఏం చేయాలని మథన పడుతున్నా.

పీటర్ చేతిలో పదుల నోట్లు చూసి ప్రాణం లేచి వచ్చింది. వందాయాభై లెక్కపెట్టి నా చేతిలో వుంచి,

"రేపు ఫస్టుకు యివ్వాలి. సుగుణా పీటర్ డబ్బు యిది. సుగుణ యింట్లో కూడా లేదు. ఆమె వేనిటీ బాగ్‌లోంచి తీసి యిస్తున్నా. నేను చెప్పుకుంటాలే. నీకు అవసరం వుండి యిచ్చేనని" అన్నాడు.

డబ్బు నా చేతిలో వుంచేప్పుడు పీటర్ చూసిన చూపు జన్మ జన్మలకు మరిచిపోలేను. 'డబ్బులేనివాడికి వెధవ బంధాలు, పనికిమాలిన సెంటిమెంట్లూ యేమిటి?' అన్నట్లుంది, పీటర్ చూపు. వాడి కళ్ళల్లోకి చూడకుండా "లెక్కపెట్టుకో" అని అంటున్నా జేబులో కుక్కుకున్నాను. కృతజ్ఞత చెప్పాను. పీటర్ దగ్గరే తెల్లకాగితం తీసుకొని లీవ్‌లెటర్ రాసి, మా హెడ్‌కు యిమ్మన్నాను.

సరేనంటూ ఎంతో చనువుగా అన్నాడు:

"తొందరగా రండి! క్లాసులు పోతాయి" అన్నాడు.

పీటర్ సలహాకు సంతోషించాను. అంత మాత్రమే సలహా యిచ్చాడు.

'నీది దినకూలి కదా, యిన్ని గంటలకు యింత డబ్బు పోతుంది' అని చెప్పలేదు.

అంగీకార సూచకంగా తల వూపి బయటపడ్డాను.

సుగుణా పీటర్ డబ్బు! పీటర్ డబ్బు!! యెవరి డబ్బు అయితే నాకేం? అది దూరాన్ని జయిస్తుంది. స్థలాన్ని దాటుతుంది. నన్ను కాళహస్తి చేరుస్తుంది. నేను రామచంద్రను చూస్తాను. నాకు కావలసింది అంతే.

యింట్లో వరలక్ష్మి చేతికి వో నలభై యిచ్చాను. ఆవిడ నా పరపతి చూసి ఆశ్చర్య పోయినట్లుంది. నా తొందరకు యిబ్బంది పడినట్లుంది. యేమీ అనకుండా తీసుకొని "తొందరగా రండి" అంది.

ఆదరాబాదరాగా ప్రయాణమై వెళ్ళాను.

నిద్రలేమితో, మనసు కుళ్ళబొడుస్తున్న ఆలోచనలతో, రామచంద్ర యింకా కొన్నాళ్ళు తప్పక జీవిస్తాడు అనే ఆశతో, రామచంద్ర యేమైనా అయివుంటే యశోధరను యెలా ఓదార్చాలో తెలీనితనంతో మరుసటి రోజు వుదయానికి కాళహస్తి చేరుకున్నాను.

రామచంద్ర యింటి ముందు యే సందడీ లేదు. గుండె అదురుతోంది. యింట్లోకి వెళ్ళాను. వో మూల మోకాళ్ళచుట్టూ చేతులేసి ముఖం దాచుకొని వుంది యశోధర. ఆ పక్కనే వాళ్ళమ్మ దీనంగా కూచొని వుంది. రామచంద్ర కూతురు అమాయకంగా అవ్వ ఒడిలో నిద్రపోతోంది. నలుగురయిదుగురు కాలేజీ విద్యార్థులు మౌనంగా కూచొని వున్నారు. ఒక మంచం మీద యశోధర వాళ్ళ నాన్న కూచోని వున్నాడు.

పరిస్థితి అర్థమైంది నాకు. నోట మాట రాలేదు.

"హైదరాబాద్ నుంచే వస్తున్నావా?" యశోధర నాన్న ప్రశ్నలో నాకేదో విపరీత ధోరణి కన్పించి సమాధానించలేదు.

యశోధర తలెత్తి చూసింది. ఆమె నొసట పసుపు కుంకుమ లేదు. కాసేపు బెక్కింది.

నా సానుభూతి వాక్యాలేవో వాటిని మౌనంగా వింది. మళ్ళీ కుళ్ళుకుంటూ యేడుస్తూ కూచుంది. ఆ వాతావరణం నాకు హృదయశల్యంగా వుంది.

యశోధర వాళ్ళ నాన్న మా రామచంద్ర చివరి ఘడియలను గురించి వివరిస్తున్నాడు. శివారెడ్డి విషయాన్ని ప్రశంసిస్తున్నాడు.

"మనిషంటే శివారెడ్డేనయ్యా! అంత పెద్ద ఆఫీసరు, స్నేహితుని కోసం పడిన అవస్థలు తలచుకుంటే నాకే యెలానో వుంది. మమ్మల్ని పిలిపించింది అతనే. యేదో బుద్ధి తెలీక యిన్ని రోజులు వీళ్ళను పోగొట్టుకున్నాను. యిప్పుడు యశోధరకు యెవరున్నారు చెప్పు, కన్నతల్లి తండ్రులం మేం తప్ప? వాళ్ళ అత్త మామలకు యేం పట్టింది? మొన్న చూశారు నిన్న వెళ్ళిపోయారు."

ఆయన మాటల్లో నాకేమాత్రం సహజత్వం కన్పించలేదు. యిప్పుడు తాము తప్ప యశోధరకు యెవ్వరూ లేరట!

అక్కడ ఒక్కక్షణం వుండలేకపోయాను.

"వెళ్ళొస్తానమ్మా!" అన్నాను.

యశోధర మౌనంగా తల వూపింది.

"శివారెడ్డి పొద్దున్నే నెల్లూరికి వెళ్ళిపోయాడు. వారి జబ్బు నయం కాదని మా కందరికీ తెలుసు. అయినా శివారెడ్డి బలవంతంమీదనే ఆస్పత్రిలో చేర్పించాం. ఆయన మూడు నాలుగు వేలు సాయం చేశాడు. అలాంటి స్నేహితుల ఋణం యే జన్మలోనూ తీరేది కాదు. అమ్మానాన్నా కూడా సమయానికి వచ్చి ఆదుకున్నారు" యశోధర ఆపుతూనే యశోధర నాన్న అందుకున్నాడు:

"పాపం! శివారెడ్డిని చాలా యిబ్బందులు పెడుతున్నాం. ఆ పదివేల విషయం ప్రిన్సిపాలుతో మాట్లాడి వెళ్ళాడు. పెన్షన్ విషయం చూస్తున్నాడు..."

యశోధర బెక్కుతూనే ఉంది.

మనసు చెదిరిపోయింది.

యెందుకంటున్నానో తెలీకుండా "ప్రేమలు ప్రకటించడానికి కూడా స్తోమత, తెలివి వుండాలమ్మా" అని మెల్లిగా గొణిగాను.

యశోధర వాళ్ళ నాన్న చూపులు భరించలేక బయటికి నడిచాను.

తల చెడిపోయింది.

'నన్నయ్య', 'తెలుగు వెలుగు' పాఠాల్లోకి! 'వ్యక్తి స్వాతంత్ర్యం' ప్రణాళికలు – దేశాభ్యుదయం' కాంపోజిషన్ల తప్పుల్లోకి వెళ్ళాలి. త్వరగా వెళ్ళాలి... గంటకు ఆరు రూపాయల ప్రపంచంలోకి.

❖

*ఫిబ్రవరి, 1979 – యువ మాసపత్రిక*